# తప్పు

"ప్రకాశరావుగారు ఎవరండీ?" బ్యాంకుప్యూన్ గట్టిగా కేక వేశాడు.

పెన్షనుకోసంవచ్చి విత్‌డ్రాయల్ ఫారంనింపి ఇచ్చిన ప్రకాశరావు తనేనని చెప్పాడు.

"ఆఫీసరుగారు మిమ్మల్ని లోపలకు రమ్మంటున్నారు" అన్నాడు వాడు.

తనను ఏనాడు ఏ అధికారి పిలవలేదే! తన ఫారంలో తప్పుందా? లోనికి వెళ్ళి "నమస్కారం సార్!" అన్నాడు ప్రకాశరావు.

"అయ్యయ్యో మీరు పెద్దవారు. నాకు నమస్కారం ఏమిటి? మీరలా కూర్చోండి" అన్నాడతను లేచి నిలబడుతూ.

ఇంతలో ప్యూన్ టీ తెచ్చి ప్రకాశరావు ముందుంచాడు.

"బాబుగారు మీరు నన్ను పోల్చలేదా? నేను రాజేష్‌ను" అన్నాడు.

రాజేష్ ఎవరో ప్రకాశరావుకి ఒకంతట అర్థంకాలేదు.

"ఎనిమిదేళ్ళు వెనక్కు వెళ్ళండి. మీకు తప్పక ఈ రాజేష్ గుర్తుకి వస్తాడు"

◆ ◆ ◆

ఆఫీసు నుంచి ఇంటికి రాగానే ప్రకాశరావుకి గుమ్మంలోనే కనిపించాడు ఆ యువకుడు. వాడి చేతిలో ఒక పాత రగ్గు వుంది. అది తన ఇంటిలోనిదే. పనికిరాదని మూడేళ్ళక్రితం మూల పారవేసినది. వాడు దానిని దొంగతనంగా పట్టుకుపోవడానికి ఆస్కారం లేదు. ఆ రగ్గువరకు దొంగతనంగా చేరగలిగాడంటే అంతకంటే ఖరీదైనవి అపహరించగలిగివుండేవాడు.

దయాగుణంగల తన భార్య రమ లేదా తన తండ్రి కానీ దాన్ని వాడికిచ్చివుండవచ్చు.

ప్రకాశరావుకి ఆ కుర్రవాడు నమస్కారం పెట్టి వెళ్ళిపోయాడు. వాడంటే అతనికి సదభిప్రాయం కలగలేదు. ఇంట్లోనికి వెళ్ళి బూట్స్ విప్పుతూ ఆ కుర్రవాడి గురించే ఆలోచించసాగేడు. ఇది మూడోసారి దగ్గరగా చూడటం. వాడి డ్రెస్‌లో ఎలాంటి మార్పులేదు. చిరిగి మాసికలు వేసిన బూడిదరంగు పేంటు. వాడు వేసుకున్న చిరిగిపోయిన షర్టు కుట్టించినప్పుడు మల్లెపువ్వులా తెల్లగా వుండివుంటుంది. ఇప్పుడు దాని రంగును పోల్చుకోవడం కష్టం. కాలికి హవాయి చెప్పులున్నాయి. ఒకదాని బద్దీ గోధుమరంగుదైతే రెండవది

నీలంరంగుది. ముష్టివాడా? లేక దొంగా? ఏమో రెండూ కావచ్చు.

రాత్రి పదిగంటల సమయం. ఇంట్లో వున్న మిగతా ముగ్గురూ నిద్రపోతున్నారు. ప్రకాశరావు ఆఫీస్ ఫైల్స్ చూసుకుంటున్నాడు. కాలింగ్‌బెల్ మోగింది. ఎవరైవుంటారో ఇంత రాత్రి ఎందుకు వచ్చారో, కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్నాడు. మళ్ళీ బెల్‌మోగింది. తలుపు తీయకుండా తలుపు విజువల్ హోల్‌లోంచి బయటకు చూశాడు.

తెలిసిన ముఖం కాదు. వాలకం బట్టీ చూస్తే ముష్టివాడిలాగున్నాడు. ఈ రోజులలో ముష్టివాళ్ళూ కాలింగ్‌బెల్ నొక్కి ముష్టి అడుక్కోవడం మొదలెట్టారా? వాడు దొంగా? తలుపు తీయగానే కత్తి చూపి లోనకు ప్రవేశించి దోచుకుంటాడా?

ప్రకాశరావు తలుపును కొంచెం తెరచి "ఎవరు? ఏంకావాలి?" అని అడిగాడు.

"బాబుగారు! అగ్గిపెట్టె ఇప్పిస్తారా?"

డబ్బు, అన్నం, బట్టలు అడుక్కునే ముష్టివాళ్లను చూశాడు. వీడు బీడీ కాల్చుకోవడానికి కాలింగ్‌బెల్ నొక్కి అగ్గిపెట్టె అడుగుతున్నాడు. చాలా ఉద్దండుడిలాగున్నాడు. మనసులో అనుకుని ఆ మాటే గంభీరంగా కోపంగా అన్నాడు.

"నాకు బీడీ తాగే అలవాటు లేదు. చలిగా వుంది. మంట వేసుకోవాలంటే అగ్గిపెట్టె లేదు. బయట దుకాణాలు కట్టేశారు. ఈ లైనులో మీ ఒక్కరి ఇంటిలోనే లైటు వెలుగుతున్నాది" అన్నాడు వాడు.

"నీ ఇంటికి దగ్గరలో ఇళ్లు లేవా?"

"బాబూ ! నాకు ఇల్లూ, వాకిలి లేదు. ఈ వీధిలో ఓచెట్టుకింద వుంటున్నాను. చలికి తట్టుకోలేక కర్రపుల్లలు, చెత్తాపోగుచేశాను. అంటించే సాధనం లేదు" అన్నాడు వాడు.

ప్రకాశరావు వాడిని బయట నిల్చోమని చెప్పి ముందుచూపుతో తలుపు కొద్దిగా గడియ వేసి వంటింటిలోనికి వచ్చి ఖాళీ అగ్గిపెట్టెలో నాలుగు పుల్లలు వేసి తలుపు కొద్దిగా తెరచి వాడి చేతికిచ్చాడు.

రెండోమారు వాడు సాయంత్రం ఏడుగంటల వేళప్పుడు వచ్చాడు.

"ఇప్పుడేం లేదు పోపో" అంటోంది రమ. తాను యథాలాపంగా బయటకొచ్చాడు.

"అమ్మగారూ! నేను ముష్టివాడిని కాను. కూలిపని చేసి బ్రతుకుతున్నాను. వర్షాల కారణంగా రెండురోజులై పనిలేదు. భోజనమూ లేదు. ఆకలితో మాడిపోతున్నాను. మీరు కనుక కాస్తా అన్నం పెట్టకపోతే నా ప్రాణాలు పోతాయి ఈ రాత్రే"

రమ హృదయం కరిగిపోయింది. కొంచెం అన్నమూ, కూరా ఆకులో పొట్లాం కట్టి అతనికి ఇచ్చింది.

ప్రకాశరావుకి వాడి మాటలు నమ్మదగినవిగా తోచలేదు.

తిరిగి ఈ రోజూ మళ్లీ వచ్చాడు.

"ఆ కుర్రాడు చలికి ఒణికిపోతూ నాలుగైదుమార్లు చెట్టుకింద కనిపించాడు. నేనే నా పాత రగ్గు ఇచ్చాను" అన్నాడు ప్రకాశరావు తండ్రి.

ప్రకాశరావుకి వాడి ప్రవర్తనలో ఏదో మోసం వున్నట్లు అనిపించింది. వాడు మోసకారి అనడానికి అధారాలు లేవు. కీడెంచి మేలెంచాలి అంటారు. వాడు చూడబోతే ఏదో మిషన తరచు ఇంటికి వచ్చి అనుపానాలు తెలుసుకుంటున్నాడు. సందుదొరకగానే వున్నదంతా దోచుకుపోతాడు. పచ్చిదొంగ. అతివినయం ధూర్త లక్షణం.

ఇంటికి దగ్గరలో వున్న పోలీసుస్టేసుకి ఫోనుచేసి ఒక దొంగను పట్టిఇస్తున్నందుకు సంతృప్తిచెందాడు. ఆ రోజు పొద్దుపోయినతరువాత ఏ.ఎస్.ఐ. ప్రకాశరావు ఇంటికి వచ్చాడు.

"మీరు చెప్పిన ఆ కుర్రవాడి గురించి దర్యాప్తుచేశాను. వాడు దొంగ అనుకోవడానికి ఆధారాలు లేవు. బ్రతికి చెడ్డవాడు. కూలీనాలి చేసుకుని పొట్టపోసుకుంటున్నాడు. నా అన్నవాళ్లు లేరు. ఈ కాలనీలో ఓ చెట్టుకింద బతుకుతున్నాడు. అతని గురించి మరెవరికీ అనుమానం లేదు" అన్నాడు ఏ.ఎస్.ఐ.

అతను చెప్పినదానితో ప్రకాశరావు సంతృప్తిచెందలేదు.

"దొంగలు పడ్డ ఆరునెలలకు పోలీసులొస్తారంటారు. అలాగుంది మీ ధోరణి, వాడిని నేను నాలుగైదుసార్లు నిశితంగా చూశాను. సమయం దొరికితే కన్నం వేసేవాడిలాగున్నాడు. మీరు వాడిని వెనకేసుకొస్తున్నారు" అన్నాడు.

"అతనిమీద దొంగకేసు పెట్టి జైలుకు పంపడం మాకు చిటికెలో పని. కానీ అలాచేస్తే వాడు నిజంగా దొంగగా మారుతాడు. సమాజానికి హాని కలిగిస్తాడు. పోలీసులకు తలనొప్పి. వాడి జీవితం పాడవుతుంది. ఇది మీరు కోరుకుంటే స్టేషనుకి వచ్చి వ్రాతపూర్వకంగా రిపోర్టు ఇవ్వండి" అంటూ ఏ.ఎస్.ఐ. వెళ్ళిపోయాడు.

ప్రకాశరావు మనస్సు డోలాయమానమైంది. ఏమి చెయ్యాలి? ఎటూ తేల్చుకోలేక పోయాడు. తను కనుక రిపోర్టు ఇస్తే పోలీసు స్టేషను, కచేరీల వెంట తిరగాలి. ప్రకాశరావు ఆ విషయాన్ని అక్కడ వదిలేశాడు.

మరి కొన్ని రోజుల తరువాత ఆ కుర్రాడు ప్రకాశరావింటికి మళ్ళీ వచ్చాడు. అప్పుడే ప్రకాశరావు ఇంటికి వచ్చాడు. "అయ్యగారు ఆఫీసునుంచి ఇప్పుడే వచ్చారు. ఒక గంట పోయిన తరువాత రా" అంది రమ వాడితో.

ప్రకాశరావుకి వాడిప్రవర్తన అర్థంకాలేదు. వాడు తన ఇంటికే చీటికిమాటికి ఎందుకు వస్తున్నాడు? ఇలాగే అందరి దగ్గరకూ వెళ్తున్నాడా? వాడి ఆంతర్యం ఏమిటి? వాడితో మనసు విప్పి మాట్లాడితే? కానీ అతని అహం అడ్డొచ్చింది. ఒక అనామకుడితో, ఒక దిగజారినవాడితో తనకేం పని? అన్నట్టుగానే వాడు ఒక గంట పోయినతరువాత వచ్చాడు.

"మళ్ళీ ఎందుకొచ్చావు? అగ్గిపెట్టె కావాలా? అన్నం కావాలా? బట్టలు కావాలా? లేక ఇంకా ఏమైనా కోరికలున్నాయా?"

"బాబుగారూ! నేను అడుక్కోవడానికి రాలేదు. కానీ మీ సహాయం కావాలి"

ప్రకాశరావు సహనంగా వినాలనుకున్నాడు.

"మీ ఆఫీసులో ఏదైనా పోస్టు ఖాళీగా వుంటే నాకో అవకాశం ఇవ్వండి. స్వీపరు పని అయినా సరే" అన్నాడు వాడు.

ప్రకాశరావుకప్పుడనిపించింది తన ఊహ తప్పు కాదని. స్వీపరు పనిచేయడానికి వాడు సిద్ధపడుతున్నాడు... అంటే వాడు అంటరానివాడే.

"ఉద్యోగాలు నా చేతిలో లేవు అయినా ఎంతవరకు చదువుకున్నావు?"

"స్వీపరు పనికి ఎంత చదువుండాలి? మీతో నిజం చెప్తున్నాను. నేను బి.ఎ.ఫస్టు డివిజన్‌లో పాసయ్యాను. నా సర్టిఫికేట్లు చూస్తారా?"

"అక్కరలేదు. బి.ఏ. పాసయ్యానంటున్నావు. ఉద్యోగాలు ఎలా వస్తాయో నీకు తెలియదా?" అడిగాడు ప్రకాశరావు.

"తెలియక కాదు. తాహతులేదు. లంచం ఇచ్చుకోవడానికి నా దగ్గరేముంది? ఇక రికమెండేషనా - మీరు తప్ప నాకు తెలిసినవారెవరున్నారు? అందుకే మిమ్మల్ని ప్రాధేయపడుతున్నాను" అన్నాడు దీనంగా.

"నాకే రూల్సు చెప్తున్నావా?"

"క్షమించండి. మీరడుగుతే యథార్థం చెప్పాను. నేను చెప్పింది తప్పు అంటారా?"

"నా కాళ్ళు పట్టుకునే బదులు ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్చేంజ్‌వాళ్ల కాళ్ళు పట్టుకో"

"అదీ చేశాను సార్! వాళ్లు మాత్రం నాలాంటి నిరుపేద మాట వింటారా? కనీసం రోజువారీ పనినైన ఇప్పించండి. మీ మేలు మరువను"

ప్రకాశరావుకనిపించింది-వీడు కాలికి వేస్తే మెడకు, మెడకు వేస్తే కాలికి వేసేరకమని. ఎంతైనా యువకుడు, బరితెగించినవాడు. వీడిని వదిలించుకోవడం ఎలాగో అతనికి బోధపడలేదు.

ఆపద్బాంధవిలా రమ కల్పించుకుని "అలాగే బాబు! ఏదైనా ఖాళీ వస్తే నీకు కబురు చేస్తాం. ఇక వెళ్ళు" అంది.

"ఆ మాత్రం దయ చాలు" అంటూ వాడు సంతోషంగా వెళ్ళిపోయాడు.

"రమా! వాడికెందుకు మాట ఇచ్చావు? వాడిక జలగలా మనల్ని వదలడు"

"ఏమండీ! వాడు మీ హోదా అధికారాలు తెలుసుకోకుండా మిమ్మల్ని దేబిరించడంలేదు. మాట ఇచ్చామని నిలబెట్టుకోవాలని రూలు వుందా? ఎప్పుడొచ్చినా ప్రస్తుతానికి ఖాళీలు లేవు మరో రెండు నెలల తరువాత కనిపించు అని చెప్తే సరిపోతుంది" అంది రమ తెలివిగా.

ప్రకాశరావు ఆఫీసులో రెండు కంటెన్‌జెన్సీ పోస్టులు ఖాళీ అయ్యాయి. డిప్యూటీ డైరక్టరు పదవిలోనున్న అతనే వాటిని భర్తీ చేయగలడు. ఆ కుర్రాడికి ఒక పోస్టు ఇస్తే బాగుంటుందన్న ఆలోచన అతనికి వచ్చింది.

అయితే ఆ పోస్టులకోసం ఇద్దరు ఒత్తిడి తెచ్చారు. ఒకతను ప్రకాశరావు పై అధికారి. అతని మాట చెల్లించకపోతే తన నతడు ముప్పుతిప్పలు పెడతాడు. రెండోవాడు ప్రకాశరావు మిత్రుడు. అతని అభ్యర్థిని కాదంటే మిత్రత్వం శతృత్వంగా మారుతుంది. అందువల్ల వాళ్లు రికమెండ్ చేసిన వాళ్ళకే ఉద్యోగాలు ఇచ్చాడు.

ఇద్దరూ రెండు మూడు రోజులలో పనిలో చేరారు. అందులో ఆ కుర్రాడూ వున్నాడు. అతని పేరు రాజేష్ అని అప్పుడు తెలిసింది. రాజేష్ తన ఊరివాడు, అతని తల్లిదండ్రులు బీదవారు, వాడికి ఉద్యోగం ఇచ్చి పుణ్యం కట్టుకో అంటూ ఆ మిత్రుడు అన్నాడు. అది నిజమేనని తను విశ్వసించాడు. కానీ మిత్రుడు తనతో పచ్చి అబద్ధం చెప్పాడు. రాజేష్ దగ్గర వెయ్యి రూపాయలు లంచం తీసుకోవడమేకాక అతని ఇంట్లో ప్రతిరోజు బట్టలు ఉతకడం, ఇళ్ళు తుడవడం, పిల్లలను స్కూళ్ళకు తీసుకువెళ్ళి తీసుకురావటం లాంటి పనులను ఉచితంగా చేయటం అనే ఒప్పందం చేసుకున్నాడట.

ఒకేసారి రెండు తప్పులు చేసినందుకు ప్రకాశరావు మొదటిసారిగా బాధపడ్డాడు. ఆ మిత్రుడు తనను నమ్మించి మోసం చేసినందుకు బాధపడ్డాడు.

రాజేష్ దగ్గర లంచం ఇవ్వడానికి వెయ్యిరూపాయలెలా వచ్చాయి? అవసరం ఎంత పనైనా చేయిస్తుంది. అతను దొంగతనం చేశాడా?

ప్రకాశరావు తన నమ్మకమైన ఉద్యోగిద్వారా కూపీ తీశాడు.

"ఇలాంటి అవసరం ఎప్పుడైనా వస్తుందని నాకు తెలుసు. అందుకే కూలి చేయగా వచ్చిన డబ్బుల్లో సగం దాచేవాడిని. అలా ఆ డబ్బు పొట్ట మాడ్చుకుని కూడబెట్టాను" అని రాజేష్ చెప్పాడట.

ఈ విషయాలు విన్న తరువాత ప్రకాశరావు తన పొరపాటును అర్థం చేసుకున్నాడు. ఇంత జరిగినా రాజేష్ స్వభావంలో పెద్దగా మార్పు రాలేదు. మొదట్లోలాగే నమస్కారం చేసేవాడు. అయితే అతని స్థాయిలో పెద్దమార్పు కనిపించింది. ఇప్పుడు మురికిబట్టలకు బదులుగా మంచిబట్టలు వేసుకుంటున్నాడు.

ఒకనాడు తను రాజేష్‌ని అనుమానించి జైలుకి పంపడానికి సిద్ధపడ్డాడు. వాడి అదృష్టం వాడిని కాపాడింది. తన తప్పుని దిద్దుకోవాలనుకున్నాడు ప్రకాశరావు. ఆరునెలల తరువాత వాడి ఉద్యోగాన్ని రెగ్యులర్ చేయాలనుకున్నాడు. కానీ ప్రకాశరావుకి ఆ అవకాశం లభించలేదు. అతనికి వేరే చోటికి బదిలీ అయింది.

◆ ◆ ◆

"రాజేష్! నువ్వా?! నిన్ను పోల్చలేకపోయాను. ఆ రోజుల్లో నీ పట్ల మూర్ఖంగా ప్రవర్తించి పెద్ద తప్పు చేశాను"

రాజేష్ వింటున్నాడు.

"నువ్వు ఇక్కడ...?"

"నన్నిక్కడ చూసి ఆశ్చర్యపోతున్నారా? ప్రొబేషన్ ఆఫీసర్ల పోస్టుకి అప్లై చేశాను. సెలక్ట్ అయ్యాను. ఈనాడు నేను ఈస్థితికి రాగలిగానంటే అది మీ చలవే!"

"నా చలవా? కాదు కాదు. నేను నీకేనాడూ, ఉపకారం చేయలేదు" అన్నాడు ప్రకాశరావు.

"మీరు చేసిన ఉపకారాలు మీకు గుర్తుండకపోవడం సహజం"

"నేను నమ్మను"

"మీరు నమ్మకపోయినా అది యథార్థం. ఆ రోజుల్లో చలికి తట్టుకోలేక ఆ ఊరిలో ఎందరో నడిరోడ్లమీద చచ్చిపోయారు. ఆనాడు మీరు అగ్గిపెట్టె ఇచ్చి నా ప్రాణాలను కాపాడేరు. మూడురోజుల పాటు పని దొరకక నేను పస్తులున్నాను. అలాగే మరో రోజు వుంటే చచ్చిపోయేవాడిని. అమ్మగారు అన్నం పెట్టి నా ప్రాణం పోకుండా నిలబెట్టారు. మరోమారు మీనాన్నగారు రగ్గు ఇచ్చారు. చలిబాధకు చితిమంటదగ్గర జాగరం చేయవలసిన పరిస్థితులనుంచి నన్ను కాపాడేరు.

రాత్రులు ప్రశాంతంగా నిద్రపోవడం వలన కూలిపనిలో మరింత సంపాదించి ఆ డబ్బుతో ఉద్యోగాన్ని కొనుక్కోగలిగాను. చివరగా మీరు నన్ను అపార్థంచేసుకుని నామీద పోలీసు కంప్లైంట్ ఇచ్చి నన్ను జైలుకి పంపాలనుకున్నారు. అయితే మీలోని మంచితనం ఆ పనిని

చేయనివ్వలేదు. అది నా పాలిట మహోపకారమే అయింది" అన్నాడు రాజేష్.

అప్పుడే ప్యూన్ ప్రకాశరావు పాస్‌బుక్కు, పెన్షను డబ్బులు తెచ్చి ప్రకాశరావుకిచ్చి అతని దగ్గర టోకెన్ తీసుకున్నాడు.

"రాజేష్! నా తప్పులను నీ పాలిట వరాలుగా నీవు భావిస్తున్నావు. అయినా నేను చేసింది తప్పే. అర్థంలేకుండానే నీ భవిష్యత్తును కాలరాసే ప్రయత్నం చేశాను. నన్ను క్షమించు" అన్నాడు ప్రకాశరావు.

– స్వాతి, మాసపత్రిక